కాం(గెస్ నాయకుడు ధ్వంసం చేసిన ఇల్లు, జేసీబీతో కూలగొడుతున్న సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబసభ్యులు

## నిరుపేద ఇంటిని కూల్చేసిన ఎమ్మెల్యే అనుచరుడు

నయీంనగర్, ఏప్రిల్ 29 : 'నేను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మనిషిని.. నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు.. మీరు ఎన్ని సంవత్సరాల నుంచి ఇక్కడున్నా సరే.. ఇక్కడి నుంచి వెళ్లాల్సిందే' అంటూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు కోన శ్రీకర్ బెదిరించినట్టు బాధితులు తెలిపారు. బాధితురాలు చింతల స్వరూప కథనం ప్రకారం.. చింతల స్వరూప తన మామ చింతల వెంకట్రాంనర్సయ్య నుంచి సంక్రమించిన ఇంట్లో 30ఏండ్లుగా ఉంటున్నారు. కరెంట్ బిల్లుతోపాటు ఇంటి పన్ను కడుతున్నారు. మంగళవారం ఆమె తన కూతురితోపాటు చిన్నపిల్లలు ఇంట్లో ఉన్న సమయంలో ఎమ్మెల్యే నాయిని అనుచరుడు కోన శ్రీకర్ కొంతమంది రౌడీలు, జేసీబీలతో వచ్చి ఇష్టమొచ్చినట్టు మాట్లాడాడు. వారి సెల్‌ఫోన్లను లాక్కొని, జేసీబీతో ఇంటిని ధ్వంసం చేశాడు. ఉగాది పండుగకు ముందు రోజు ఇలాగే జరగడంతో బాధితులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వద్దకు వెళ్లి చెప్పుకొంటే అలా ఏమీ చేయరని హామీ ఇచ్చారు. మళ్లీ కొద్దిసేపటికి ఎమ్మెల్యే నాయిని బాధితులకు ఫోన్‌చేసి ఆ భూమి మీది కాదంట కదా అమ్మా.. అని అనడంతో ఏం చేయాలో అర్థం కాలేదని స్వరూప ఆవేదన వ్యక్తంచేశారు. గతనెల 20న వీధి వ్యాపారులపైనా ఎమ్మెల్యే అనుచరులు వీరంగం సృష్టించడంతో వారు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తాజాగా ఇంట్లో అందరూ ఉండగా ఇంట్లోకి జేసీబీలతో ధ్వంసం చేయడమేమిటని చర్చించుకుంటున్నారు.

**'నమస్తే' కథనంతో ఆగినా.. మళ్లీ నేడు వెలుగులోకి**

'వారసత్వ భూమిని కబ్జా చేస్తున్నాడు.. స్థానిక ఎమ్మెల్యే అనుచరుడినని బెదిరిస్తున్నాడు' అంటూ 'నమస్తే తెలంగాణ'లో ఈనెల 5న కథనం ప్రచురితమైంది. దీంతో అంతా సద్దుమణిగిందని అనుకునేలోపే మళ్లీ జేసీబీలు రావడంతో ఏం చేయాలో తెలియక బాధితులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'ఇక్కడ భూముల పంచాయితీలు చెయ్యబడవు' అంటూ స్టిక్కర్ అతికించారు. కానీ, బయట మాత్రం ఆయన అనుచరులతో ఇండ్లపైకి జేసీబీలు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. నిరుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లునే.. నేడు జేసీబీలతో కూలగొట్టి కబ్జాకు యత్నిస్తుండటంపై విమర్శలొస్తున్నాయి.

## వ్యవసాయంలో డిజిటల్ పద్ధతులు అవసరం

**ఉద్యాన వర్సిటీ వీసీ రాజిరెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంలో నిలదొక్కుకునేందుకు డిజిటల్, సాంకేతిక పద్ధతులు వినియోగించాల్సిన అవసరం ఉందని ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమాజిగూడలో సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన అగ్రివిజన్-2025లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతుల వ్యవసాయాన్ని బలోపేతం చేస్తేనే భవిష్యత్తులో పర్యావరణ మార్పులను దీటుగా ఎదుర్కోగలమనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. వ్యవసాయంలో సుస్థిరత, ఉత్పాదకత పెంపునకు టెక్నాలజీ ఆధారిత అనువర్తనాలను వాడుకోవాలని సూచించారు. పంటల వైవిధ్యం పాటించాల్సిన ఆవశ్యకత ఉన్నదని తెలిపారు. ఉద్యాన పంటల్లో కోత అనంతరం నష్టాల తగ్గింపునకు డిజిటల్ అప్లికేషన్స్ అవసరమని చెప్పారు. ఆ దిశగా పరిశోధనలు ముమ్మరం చేయాలని సూచించారు.

# రైతులను భయపెట్టి భూములు కొల్లగొట్టి!

మొదటిపేజీ తరువాయి...

ఎకరాలు, 294/7- 19.26 ఎకరాలు, 294/8-16.24 ఎకరాలు, 294/9-11.12 ఎకరాలు, 294/10- 51.36 ఎకరాలు) విస్తీర్ణం నమోదై ఉన్నది. ఇందులో 294/8, 294/9, 294/10 సర్వేనంబర్లలో కొంత భూమిని 1973-74 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల నిరుపేదలకు అసైన్డ్ చేసిందని భూమిలో కాస్తు చేసుకుంటున్న రైతులు చెప్తున్నారు. వాస్తవానికి ఇందుకు అనుగుణంగానే గతంలో రికార్డులున్నా.. చాకచక్యంగా వాటిని మాయం చేసి తారుమారు చేశారు. వీటికి సంబంధించిన రికార్డులు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకున్నా నామమాత్రంగా కొన్ని రికార్డులిచ్చి, అసలు రికార్డులను మాత్రం ఇవ్వకపోవడం గమనార్హం.

**ఎన్నికల ఎజెండాగా భూ సమస్య**

1955-58 సెస్సాల ప్రకారం 294 సర్వేనంబర్‌లో 178.06 ఎకరాల రక్బా (పాతది) ఉన్నది. కానీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం 187.05 ఎకరాలుగా నమోదైంది. ఈ లెక్కన సుమారు 9ఎకరాల విస్తీర్ణం ఎక్కువ నమోదైంది. ధరణి చట్టం కంటే ముందు ఉన్న రెవెన్యూ నిబంధనల ప్రకారం రక్బా కన్నా నమోదు మొత్తం ఎక్కువ ఉంటే మ్యుటేషన్ చేయొద్దు. ఈ సర్వే నంబర్‌లో ఎక్కువశాతం ప్రభుత్వ భూమిగా ఉన్నది. ఈ కారణంతోనే రెవెన్యూ అధికారులు భూ మార్పిడి దరఖాస్తులను తిరస్కరించారు. ఆ మండలంలో పని చేసిన ప్రతి ఒక్క అధికారికి, ఆ గ్రామ రెవెన్యూ రికార్డులు తెలిసిన ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలుసు. దీంతో 15 ఏండ్ల నుంచి ఈ భూముల్లో క్రయ విక్రయాలు జరగలేదు. ఖరీజ్ ఖాతాగా ఉన్న 294/1,2,3తో పాటు పేద రైతులకు అసైన్డ్ చేసిన (రికార్డులు మాయం చేశారు) 294/8, 294/9, 294/10 సర్వే నంబర్లకు సంబంధించి జారీ అయిన డిజిటల్ పాస్ పుస్తకాల్లో స్పష్టంగా లావణి పట్టా అని ఉన్నది. అయితే ఈ భూములపై క్రయ, విక్రయాలు జరగకపోవడంతో రైతులు అవసరాలకు తమ భూమిని అమ్ముకోవాలన్నా కుదరడం లేదు.

**హక్కులు కల్పిస్తానని హామీ ఇచ్చి**

2020లో దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ క్రమంలో సదరు రైతులు ఇదే అదునుగా తమ భూములపై నిషేధంగా ఉన్న క్రయ విక్రయాల సమస్య పరిష్కరించాలని పోటీ చేసిన ప్రతి అభ్యర్థినీ కోరారు. ఇందులో భాగంగా సదరు నేత లావణి పట్టా భూములపై పూర్తిస్థాయి హక్కులు కల్పించి సమస్య పరిష్కరిస్తానని భరోసా ఇవ్వడంతో రైతులు నమ్మారు. అంతే కాదు.. ఇంటికి జత ఎడ్లు కూడా ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన సదరు ప్రజాప్రతినిధి తమ సమస్యను పరిష్కరిస్తారని 60 మంది రైతులు ఆశగా ఆయన చుట్టూ తిరిగారు. ఎన్నికల హామీ మేరకు లావణి పట్టా భూములపై పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు కల్పించి, ఎవరి భూమి ఎక్కడ ఉన్నదో చూపాలని ప్రాధేయపడ్డారు. ఇంటికి జత ఎడ్లు కూడా ఇప్పిస్తే వ్యవసాయం చేసుకుంటామని వేడుకున్నారు. పరిష్కారం చూపాల్సిన ఆయన.. గుంభనంగా ఉంటూ అంశంపై లోతుగా అధ్యయనం మొదలు పెట్టినట్టు తెలిసింది. ఇదే విషయంపై అప్పట్లో అసెంబ్లీ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా 'ఇంటికి రెండు ఎడ్లతో పాటు అసైన్డ్ భూములపై రైతులకు హక్కు కల్పిస్తానన్న హామీలేమయ్యాయి?' అని సదరు ప్రజాప్రతినిధిని ప్రశ్నించడాన్ని పలువురు రైతులు గుర్తుచేస్తున్నారు.

ప్రజాప్రతినిధి ఆధీనంలో ఉన్న భూమి

ప్రజాప్రతినిధి అనుచరుడు కొనుగోలు చేసినట్టుగా జత చేసిన పాస్ పుస్తకం

**పరిష్కారం వదిలి భూములపైనే కన్ను**

రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన సదరు ప్రజాప్రతినిధి కన్ను ఆ భూములపై పడింది. రెవెన్యూ అధికారులతో పలు దఫాలుగా చర్చించి ఆ భూముల లోతుపాతులపై పూర్తి అవగాహన తెచ్చుకున్నారు. కొద్దికాలం మౌనంగా ఉండి తర్వాత నెమ్మదిగా తన అనుచరులను రంగంలోకి దింపారు. చౌదరిపల్లి, ఇనుగుర్తి పరిధుల్లోని లావణి పట్టా భూముల సమస్య పరిష్కారం కావడం అసాధ్యమని గ్రామాల్లో ప్రచారం చేశారు. ముఖ్యంగా అప్పట్లో మిషన్ కాకతీయ పథకాన్ని ఉదహరిస్తూ ఈ భూముల్లో ఏటోనికుంట ఉన్నందున దాని పునరుద్ధరణ కింద ప్రభుత్వమే భూములను తీసుకోనున్నదనే తప్పుడు ప్రచారం వ్యాప్తిచేశారు. ఈ ప్రచారంతో ఆందోళన చెందిన రైతులు ఆ ప్రజాప్రతినిధిని కలిసి మొరపెట్టుకోగా 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో చెప్పలేం' అని మరింత భయాందోళనకు గురిచేసినట్టు ఓ రైతు అప్పట్లో జరిగిన విషయాన్ని వివరించాడు.

**నోటరీ కాయితాలపైనే వ్యవహారం..**

రైతుల భూములపై కన్నేసిన ఆ ప్రజాప్రతినిధి నేరుగా తాను స్వాధీనం చేసుకుంటే ప్రజాక్షేత్రంలో బదనాం అవుతాననే కారణంగా ముందు తన అనుచరులతో వాటిని కొనుగోలు చేయించారు. తెర మీద ఎక్కడా కనిపించకుండా ఆయన అనుచరులే క్షేత్రస్థాయిలో రైతులను సంప్రదించి.. అడ్డికి పావుశేరులా ఆ భూములను కొనుగోలు చేశారు. ఎలాగూ లావణి పట్టా సమస్య పరిష్కారం కాదు కాబట్టి వచ్చినంత తీసుకొని పక్కకుపోదామనే ధోరణిలో రైతులు భూములను అమ్ముకున్నారు. అప్పటివరకు ఆ భూములపై అధికారికంగా క్రయ, విక్రయాలు జరగకపోవడంతో ముందుగా ప్రైవేట్ ఒప్పందాలు చేసుకున్నారు. ఇందుకు 'నమస్తే తెలంగాణ'కు లభించిన ఓ డాక్యుమెంటే సాక్ష్యం! వాస్తవానికి వల్లెపు యాదయ్య, వల్లెపు మల్లయ్య, వల్లెపు లక్ష్మయ్య, వడ్డె రాజవ్వ, వడ్డె రామయ్యకు చెందిన 6.33 ఎకరాల భూమిని సదరు ప్రజాప్రతినిధి అనుచరుడొకరు కొనుగోలు చేసినట్టు ఒప్పంద పత్రం రాసుకున్నారు. దానికి రైతుల ధరణి పాస్ పుస్తకాల ప్రతులను కూడా జత చేశారు. కానీ ఆ పాస్ పుస్తకాల్లో లావణి పట్టా అని స్పష్టంగా ఉన్నది. లావణి పట్టా భూముల కొనుగోలుకు ఒప్పందం చట్టప్రకారం నేరం. దీన్ని అదునుగా చేసుకొని అక్కడ మార్కెట్ ధర రూ.30 లక్షలకు పైగా ఉంటే ఒప్పందం ప్రకారం కేవలం రూ.3 లక్షల నుంచి రూ.7.50 లక్షలకే కొన్నారు. ఇక్కడ అత్యంత కీలకమైన విషయమేమిటంటే సదరు అనుచరుడు కొనుగోలు చేసిన సమయంలో పాస్ పుస్తకాల్లో లావణి పట్టాగా ఉన్న భూమి.. అనుచరుడి నుంచి ఆ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల చేతుల్లోకి వెళ్లే సరికి పట్టా భూమిగా మారింది. ఒకవేళ రికార్డుల్లో సాంకేతికంగా తప్పు జరిగిందని వాళ్లు దబాయించే అవకాశం ఉన్నదనుకుందాం! ఈ నేపథ్యంలో ఆ సమస్య ఉన్నదనే కదా రైతులు ఎన్నికల సమయంలో ఆనేత చుట్టూ ప్రదక్షిణ చేసి భరోసా తీసుకున్నది? మరి సమస్య పరిష్కరించి రైతులకు న్యాయం చేయాల్సిన ప్రజాప్రతినిధి.. సమస్య పరిష్కారమయ్యేసరికి భూమి తన ఖాతాలో వేసుకోవడమంటేనే 'దాల్‌మే కుచ్ కాలాహై' అనే కదా?! ఇలా చౌదరిపల్లి రైతుల నుంచి సుమారు 72 ఎకరాల వరకు కొనుగోలు చేసినట్టు తెలిసింది.

**అరుదైన ఒప్పంద పత్రం**

సాధారణంగా ఒక వ్యక్తి పేరు మీద రికార్డుల్లో ఉన్న భూమిని మరో వ్యక్తి కొనుగోలు చేస్తారు. కానీ సదరు వ్యక్తి పేరు మీద లేకున్నా ఎక్కువ కబ్జాలో ఉన్న భూమిని కూడా కొనుగోలు చేస్తున్నట్టు ఒప్పంద పత్రం రాసుకోవడం అరుదే! పైగా ఒక ప్రజాప్రతినిధి! అందునా చట్టాలన్నింటినీ తూర్పారబట్టిన వ్యక్తి అయి ఉండి ఇలా చేయడమంటే ఆయనను సూటిగా 'చెప్పేందుకేనా నీతులు?' అని ప్రశ్నించవచ్చన్నమాట! నిరుడు జూన్‌లో ఒప్పంద పత్రాన్ని రాసుకున్నారు. సర్వే నంబర్ 294లో మేము (అంటే రైతులు) రికార్డుల్లో ఉన్నదాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో కబ్జాలో ఉన్నందున ఆ కబ్జాకు సంబంధించి భూమికి అక్షరాలా పదిహేను లక్షల రూపాయలు ఇచ్చి కబ్జాను బదిలీ చేసుకుంటున్నామనేది ఒప్పంద సారాంశం. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు రైతులు తమ పేరిట ఉన్న దాన్నే అమ్ముకున్నారు. కానీ సదరు ప్రజాప్రతినిధి ఆ విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న భూమిని తన స్వాధీనంలోకి తీసుకొని చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తాము అమ్మినదాని కంటే ఎక్కువ కబ్జాలో ఉన్నావు కదా అని ప్రశ్నించడంతో కబ్జా విషయం ఎక్కడ బయటికి పొక్కుతుందోనన్న భయంతో వాళ్ల నోర్లు మూయించేందుకు వాళ్లే కబ్జా చేసిన భూమిని తాను బదిలీ చేసుకున్నట్టుగా ఒప్పంద పత్రం రాసుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వాస్తవానికి ఈ సర్వే నంబరులో 51 ఎకరాల ఖారీజ్ ఖాతా (సర్కారు భూమి) ఉన్నది. సదరు ప్రజాప్రతినిధి పరిధిలోకి వచ్చిన కబ్జాతో సర్కారు భూమికే గండి పడిందనేది బహిరంగ రహస్యం. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తేనే సదరు ప్రజాప్రతినిధి నిబంధనలకు విరుద్ధంగా లావణి భూముల్ని కొనుగోలు చేయడంతోపాటు ప్రభుత్వ భూమిని ఎంత కబ్జా చేశారనే వాస్తవాలు బయటకొస్తాయి.

### ఒక కుంటను ముంచి.. మరో కుంటను తుంచి

సదరు ప్రజాప్రతినిధి అద్భుతంగా నిర్మించుకున్న వ్యవసాయ క్షేత్రంలో రెండు నీటి వనరులు కూడా మౌనంగా బలైపోయాయి. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన హైడ్రాను ఆ ప్రజాప్రతినిధి పార్టీ 'జాతీయ వైరం' కారణంగా తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ ఈయనగారు మాత్రం పేరుకు ప్రతిపక్ష పార్టీలో ఉండి హైడ్రాకు జైకొట్టడమే కాకుండా హైడ్రాకు వ్యతిరేకంగా హైకోర్టు వ్యాఖ్యానిస్తే న్యాయస్థానాన్ని సైతం తప్పుపట్టే రీతిలో మాట్లాడటం అప్పట్లో తెలంగాణ సమాజాన్ని నివ్వెరపరిచింది. కాకపోతే ఈ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తే మాత్రం ఆయన హైడ్రాకు జై కొట్టడంలో, హైడ్రాతో నీటి వనరులు బాగుపడతాయంటూ ప్రశంసించడంలో అసలు మతలబు ఏమిటో అర్థమవుతుంది. ఏటోని కుంట పరిస్థితి ఎలా ఉన్నదోనని 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి ఇటీవల వెళ్లి చూసినప్పుడు రెండు 200 సీసీ బుల్డోజర్లతో చెరువులోంచి మట్టిని అక్రమంగా తవ్వి, టిప్పర్లతో క్షేత్రంలోని ఇతర ప్రాంతానికి తరలిస్తున్నారు.

### దేవుని గుట్టనూ వదలని మహా భక్తుడు

ఈ వ్యవసాయ క్షేత్రానికి ఆనుకొని ప్రసిద్ధ దుబ్బ రాజేశ్వరస్వామి గుట్ట ఉన్నది. దానిపైన ఉన్న ఆలయంలో ఏటా ఉత్సవాలు జరుగుతాయి. గ్రామస్థులు గుట్ట మీదకు ఎదుర్కోళ్లకు పోతారు. ఇప్పుడు సదరు ప్రజాప్రతినిధి తన క్షేత్రానికి గుట్ట అడ్డం అని భావించారో? లేక అది చదును చేస్తే మరో ఐదారెకరాలు కలిసొస్తుందనుకున్నారో? గాని బుల్డోజర్లతో ఆగుట్టను కూడా తొలుస్తున్నారు. దీంతో ఇనుగుర్తి, చౌదరపల్లి గ్రామస్థులు వెళ్లి అడ్డుకోవడంతో ప్రస్తుతానికి ఆ పనులు నిలిచిపోయాయి. ప్రజాప్రతినిధి వ్యవహారంపై న్యాయవాది ఒకరు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

### తరుగు తీస్తున్నారని రైతు ఆత్మహత్యాయత్నం

**క్వింటాకు 10కిలోలు కట్ చేస్తున్నారని ఆవేదన**

గోవిందరావుపేట, ఏప్రిల్ 29 : కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు 10కిలోలు తరుగు తీస్తున్నారని ఆందోళనకు గురైన కౌలు రైతు ఆరబోసిన ధాన్యం వద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. గోవిందరావుపేటకు చెందిన రైతు జెట్టి రాజు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు పంట చాలావరకు దెబ్బతిన్నది. చేతికి వచ్చిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే దొడ్డు రకం ధాన్యానికి క్వింటాల్‌కు రెండు కిలోలు, సన్నరకానికి 10కిలోల కోత విధిస్తుండటంతో ఆందోళనకు గురైన ఆయన పురుగుల మందు తాగే ప్రయత్నం చేయగా పక్కనే ఉన్న రైతులు అడ్డుకున్నారు.

### ఎరువుల సరఫరాకు ఒకే టెండర్

హైదరాబాద్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): ఎరువుల స్టోరేజీ, రవాణాకు సంబంధించి టెండర్లు పిలువగా ఒకే ఒక టెండర్ దాఖలైనట్లుగా తెలిసింది. దీంతో దానిని రద్దు చేస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. రెండేళ్లకు(2025-26, 2026-27) సంబంధించి రైతులకు ఎరువులు అందించేందుకుగానూ వాటి నిల్వ, క్షేత్రస్థాయిలోకి రవాణాకు 22రేక్ పాయింట్లకు(రైలు నుంచి ఎరువులు తీసుకునే పాయింట్స్)మార్క్‌ఫెడ్ టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగానే మంగళవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా.. రెండు రేక్ పాయింట్లకు ఒక్క సంస్థ కూడా టెండర్ వేసేందుకు ముందుకు రాలేదని, మిగిలిన 20 రేక్ పాయింట్లకు కలిపి ప్రస్తుతం కొనసాగుతన్న ఒకే సంస్థ టెండర్ దాఖలు చేసినట్టుగా తెలిసింది. టెండర్లకు సంబంధించి తొలుత నిబంధనలు కఠినంగా పెట్టిన అధికారులు, ఆ తర్వాత కమిటీ సూచన, సంస్థల అభ్యర్థనతో సడలించింది. అయినప్పటికీ టెండర్లు వేసేందుకు సంస్థలు ముందుకు రాకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం ఒకే టెండర్ దాఖలైతే దానిని రద్దు చేయాల్సి ఉండడంతో దానిని రద్దు చేసి మరోసారి టెండర్‌కు వెళ్లాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించినట్టుగా తెలిసింది.

### మిల్లర్ల దోపిడీని అరికట్టాలని రైతుల ధర్నా

మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం పెర్కపల్లిలో రైతులు ఆందోళనకు దిగారు. దాదాపు మూడు గంటలకుపైగా రహదారిపై బైఠాయించడంతో వాహనాలను ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. క్వింటాల్‌కు 7 కిలోల వడ్లు అదనంగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. – దస్తురాబాద్

కల్వకుర్తిలో రోడ్డుపై ధాన్యాన్ని తగులబెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

## ధాన్యానికి నిప్పపెట్టి అన్నదాతల ఆందోళన

**క్వింటాళ్లకు పది కిలోల తరుగుపై మండిపాటు**

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 29 : పంటను కొనుగోలులో జాప్యం చేయడమేకాకుండా తరుగు పేరుతో మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి పాలమూరు చౌరస్తా వరకు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ర్యాలీ నిర్వహించారు. మిల్లర్ల దోపిడీని నిరసిస్తూ ప్రధాన రోడ్డుపై ధాన్యం పారబోసి నిప్పుపెట్టారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలో 8 పారాబాయిల్డ్ రైస్ మిల్లులు ఉండగా, కేవలం 2 మిల్లులకు మాత్రమే వరి కొనుగోలుకు అనుమతి ఇవ్వడం ఏమిటని మండిపడ్డారు. క్వింటాకు 10 కిలోల వరకు తరుగు తీయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో పొలాల వద్దకు వాహనాలు పంపించి అక్కడే కొనుగోలు చేసి రైతులకు మేలుచేశారని గుర్తుచేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేశారు.

### బుద్ధారంలో రైతుల నిరసన

తూకం వేసిన ధాన్యం తరలించేందుకు లారీలు రాకపోవడంతో వారాల తరబడి ప్రక్రియ నిలిచిపోతుందంటూ వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్ధారంలో మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. ఎర్రటి ఎండలో రోడ్డుపై ధాన్యం పోసి.. వరి కంకులతో బైఠాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యం బస్తాలు లారీలురాక వారాల తరబడి నిలిచిపోతున్నాయని వాపోయారు. – గోపాల్‌పేట

### ధాన్యం కొనాలంటూ రోడ్డెక్కిన రైతులు

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత మండలంలో రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మంథని నియోజకవర్గమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం రేగులగూడెం గ్రామానికి చెందిన రైతులు కాటారం-మంథని ప్రధాన రహదారిపై ధాన్యం పోసి ధర్నా చేశారు. 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోడం దారుణమని అన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు రోడ్డెకాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. – మహదేవపూర్ (కాటారం)

### ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల బైఠాయింపు

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్‌లో ధాన్యం తూకం వేయాలని డిమాండ్‌చేస్తూ వెల్దుర్తి-మెదక్ ప్రధాన రహదారిపై మంగళవారం రైతులు బైఠాయించారు. ఈనెల 17న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా ఇప్పటివరకు గింజ కూడా కొనలేదని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. – వెల్దుర్తి

## మే 7 నుంచి ఆర్టీసీ సమ్మె!

- రాష్ట్ర సర్కార్‌కు స్పష్టీకరణ చేసిన టీజీఆర్టీసీ జేఏసీ
- సమ్మెపై లేబర్ కమిషనర్‌కు మరోసారి నోటీసు అందజేత
- ఇప్పటికైనా చర్చలకు పిలవాలని జేఏసీ నేతల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్: ఆర్టీసీ పరిరక్షణ, ప్రభుత్వంలో విలీనం, కార్మికుల సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలు డిమాండ్లతో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సమ్మెకు సిద్ధమైంది. జనవరి 27న నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని, సమ్మెకు పోవాల్సిందేనని తేల్చిచెప్పింది. సమ్మెకు సంబంధించిన వివరణను లేబర్ కమిషనర్ ఆఫీసులో అధికారులకు మరోసారి అందజేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. మే 1న అన్ని డిపోల్లో మేడే జెండాను ఎగురవేసి, మే 5న కార్మిక కవాతు నిర్వహించి, 7నుంచి సమ్మెకు సన్నద్ధం కావాలని కార్మికులకు జేఏసీ పిలుపునిచ్చింది. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం భేషజాలు వీడి, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న కోరారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి స్పష్టంచేశారు. కొన్ని సంఘాలు జేఏసీలోకి వస్తామని చెప్తూనే యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో జేఏసీ కో-చైర్మన్ హన్మంతు, కన్వీనర్ మౌలానా, కో-కన్వీనర్లు యాదయ్య, సురేశ్, యాదగిరి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, జాతీయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**అనారోగ్యం కారణంగా సెలవు ఇవ్వకపోవడంతో మనస్తాపం**

బాన్సువాడ, ఏప్రిల్ 29 :బాన్సువాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఓ డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డ్రైవర్ గంగాధర్ తనకు సెలవు పొడిగించాలని కోరేందుకు మంగళవారం డిపోకు వచ్చాడు. అధికారులు పట్టించుకోకపోవడంతో బయటకు వెళ్లి గడ్డి మందు తాగాడు. అనంతరం డిపోకు వచ్చిన అతడు తోటి సిబ్బందితో మాట్లాడుతుండగా స్పృహ తప్పి పడిపోయాడు. వారు వెంటనే దవాఖానకు తరలించారు. అనారోగ్యం కారణంగా గంగాధర్ నాలుగు రోజులుగా సెలవులో ఉన్నాడు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో డిపోకు వచ్చి సెలవు గురించి విన్నవించగా, డీఎం పట్టించుకోకుండా కారులో వెళ్లిపోయిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం గంగాధర్ కోలుకుంటున్నట్టు తోటి ఉద్యోగులు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలకు తాళం వేయడంతో బయటనే ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు

## ప్రభుత్వ మెడికల్ కళాశాలకు తాళం

- నిధులు మంజూరు చేయక 9 నెలలుగా అద్దె చెల్లించలేదు
- పెండింగ్‌లో కోటీ 44 లక్షలు
- కళాశాల బయటనే ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఆదిబట్ల, ఏప్రిల్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం గత ఆగస్టులో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగల్‌పల్లిలో అద్దె భవనంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. రూ.కోటీ 44 లక్షల అద్దె పెండింగ్‌లో ఉండటంతో మెడికల్ కళాశాలకు మంగళవారం ఉదయం యాజమాన్యం తాళం వేశారు. దీంతో విద్యార్థులతో పాటు అధ్యాపకులు కళాశాల బయట మండుటెండలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో జోక్యం చేసుకుని తాళం తీయించడంతో తరగతులు ప్రారంభమైయ్యాయి.